జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 15-2-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 248 పేజీలు: 4 వెల : రూ.7


## ఒడిశా టు..

* నిత్యం తరలిపోతున్న గంజాయి * వ్యసనాలకు బానిసై చట్ట వ్యతిరేక పనులు
* రైళ్లు, వాహనాల్లో గుట్టుచప్పుడు కాకుండా రవాణా * 20 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న ఇచ్ఛాపురం సర్కిల్ పోలీసులు

# చెన్నై.. బెంగళూరు

**ఇచ్ఛాపురం/ శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 14 (వార్త):** ఒడిశా నుంచి ఆంధ్రా మీదుగా బెంగళూరు, చైన్నైకి నిత్యం గంజాయి గుట్టుచప్పుడు కాకుండా తరలిపోతోంది. పోలీసులు చెక్‌పోస్టుల వద్ద వాహనాలు, రైళ్లను తనిఖీలు చేస్తున్నా.. కొందరు ఎత్తుకుపై ఎత్తులు వేసి గంజాయిని దొడ్డిదారిన తరలించుకుపోతున్నారు. తరలిస్తున్న వారంతా ఒడిశా, ఇతర ప్రాంతాలకు చెందిన వారే అధికం. కొందరు యువకులు వ్యసనాలకు లోబడి, తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం సంపాదించవచ్చన్న ఆశతో గంజాయి తరలించేందుకు సిద్ధమవుతున్నారు. పోలీసులకు దొరికితే తమ జీవితాలు నాశనం అవుతాయని గమనించకుండా అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలన్న ధీమాతో ఇటువంటి పనులకు పాల్పడుతున్నారు. ఒడిశా నుంచి ఇచ్ఛాపురం మీదుగా బెంగళూరు, చెన్నైలకు తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకుని, ఐదుగురి నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు శుక్రవారం కంచిలి పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు తెలిపారు. బెంగళూరులోని ఇందిరానగర్‌కు చెందిన ముజామిల్ (25), మహమ్మద్ సిరాజుదుద్దీన్ (28) వ్యసనాలకు బానిసలై ఒడిశాలో ఫుల్బానిలో 18.310 కిలోల సరకు కొనుగోలు చేసి బెంగళూరుకు చెందిన విజయకుమార్ అనే వ్యక్తికి విక్రయించేందుకు సిద్ధమయ్యారు. రైలు నిలయం వద్ద అనుమానాస్పదంగా కనిపించిన వీరిద్దరినీ సీఐ ఎం.చిన్నంనాయుడు, పట్టణ ఎస్సై ఎం.ముకుందరావు విచారించి అదుపులోకి తీసుకున్నారు. మండల కేంద్రం కంచిలి పరిధి సోంపేట రైలు నిలయం సమీపంలో ఒడిశా, చెన్నై రాష్ట్రాలకు చెందిన ముగ్గురు వ్యక్తుల నుంచి అక్రమంగా తరలిస్తున్న 2 కిలోల గంజాయిని కంచిలి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒడిశాలోని సుర్లా కూడలికి చెందిన బి. సోమేష్ తమిళనాడుకు చెందిన అజిత్, కమలుద్దీన్‌లను అదుపులోకి తీసుకున్నారు.



**పోలీసుల అదుపులో ముఠా**

టెక్కలి పోలీసులకు గంజాయి బ్యాచ్ చిక్కినట్లు తెలుస్తోంది. టెక్కలి సమీప తోటల్లో గంజాయి సేవిస్తున్న బృందాన్ని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పట్టుకుని వారి వద్ద కొంత గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. విచారణ జరుగుతోందని, పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

# వేధిస్తే.. పనిచేయలేం



* డ్వామా పీడీతో ఇబ్బందులు పడుతున్నాం
* రాత్రి వేళ కూడా విధులు నిర్వహించాలని ఒత్తిడి చేస్తున్నారు
* పీడీ తీరుపై ఉద్యోగుల తిరుగుబాటు
* జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 14 (వార్త):** జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకుడు తీరుపై ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట పనులు చేయాలని ఒత్తిడికి గురిచేస్తున్నారని, వేధింపులు పెరుగుతున్నాయని, కించపరిచేలా వ్యవహరిస్తున్నారని, దొంగల మాదిరిగా చూస్తున్నారంటే డ్వామా ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఇదిలానే కొనసాగితే పోరాటానికి దిగాల్సివస్తోందని కొందరు ఉద్యోగులు వాపోయారు. కలెక్టరేట్ సమీపంలోని డచ్ భవన్ వద్ద శుక్రవారం ఉద్యోగులంతా సమావేశమయ్యారు. తమ సమస్యలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావును కలిసి తమ ఆవేదనను వ్యక్తపరిచారు. డ్వామా పీడీ వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేశారు. సిబ్బందిని కించపరచేలా వ్యవహరిస్తున్నారని, దొంగల మాదిరిగా చూడటం తగదన్నారు. రాత్రి వేళ కూడా వీడియో, టెలికాన్ఫరెన్సులంటూ వేధిస్తున్నారని, ఉద్యోగులతో మాట్లాడే తీరు సక్రమంగా ఉండడం లేదన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది పని చేయడంతోనే జిల్లా అన్ని కేటగిరీల్లో ముందువరుసులో ఉందన్నారు. తామంతా సక్రమంగా, సమన్వయంతో పనిచేస్తుండడం వల్లే జిల్లాకు రూ.400 కోట్లు మెటీరియల్ కాంపొనెంట్ విడుదలైందన్నారు. పండగ రోజుల్లో కూడా సెలవులు ఇవ్వకుండా కొందరిపై కక్ష కట్టుకుని వ్యవహరిస్తున్నారని వాపోయారు. పీడీ తన వైఖరి మార్చుకోకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని జేపీసీ నాయకులు వైవీ రమణ, అమ్మినాయుడు, జయరాం, తవిటినాయుడు, రవి, అరుణ్‌కుమార్, ప్రేమలత, ప్రమీల, రత్నాకర్ అన్నారు.

## ఉద్యోగాలిప్పిస్తానని మోసం

**టెక్కలి/సంతబొమ్మాళి, ఫిబ్రవరి 14 (వార్త):** టెక్కలి పట్టణం గొల్లవీధిలో ఓ మహిళ ఇంటి ముందు సంతబొమ్మాళికి చెందిన కుటుంబం శుక్రవారం నిరసనకు దిగింది. తన ఇద్దరు పిల్లలకు ఉద్యోగాలిప్పిస్తానంటూ రూ.18.60 లక్షలు తీసుకుని మోసగించిందని బాధితురాలు పందిరి సన్యాసమ్మ ఆరోపించింది. దివ్యాంగులైన కుమార్తె శ్రావణి, కుమారుడు కార్తీక్, భర్త అప్పన్నతో కలిసి బైఠాయించింది. తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. సన్యాసమ్మ పెట్రోలు క్యాన్‌తో సహా ఆ ఇంటి వద్దకు వెళ్లి నిరసన వ్యక్తం చేసింది. ఈవిషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు వారిని జిల్లా ఆసుపత్రికి తరలించారు. గతేడాది నవంబరులోనే సంతబొమ్మాళి పోలీస్‌స్టేషన్‌లో ఈ కేసు నమోదు అయింది.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## పేద కుటుంబానికి ఉద్దానం సేవా సమితి ఆర్ధికసాయం



**మందస, ఫిబ్రవరి 14(వార్త):** మందస మండలంలోని ఉమాగిరి కాలనీకి చెందిన పొందర కృష్ణారావు, లక్ష్మి దంపతులు చాలా పేదరిక కుటుంబం. ఇటీవల కృష్ణారావు గుండెపోటుతో మరణించారు. వీరికి ఇద్దరు కుమార్తెలుండగా పెద్ద కుమార్తె కల్యాణికి పెళ్లి సంబంధం కుదిరింది. పేదరికంతో కూడుకున్న కుటుంబం, తండ్రి లేని ఆడపిల్లకు కనీసం పెళ్లి ఖర్చులకు దాతలు సహాయం కోరడంతో సిక్కోలు ఉద్దానం సేవా సమితి ప్రతినిధులు వెంటనే స్పందించి రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమములో సేవా సమితి సభ్యులు తారక్, సీతారామశర్మ, మహేష్ మాస్టర్, ప్రభాకర్ మాస్టర్, బైరాగిమాస్టర్, ఝాన్సీటీచర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కదం తొక్కిన కార్మికులు

**-మందస లో నిరసన ర్యాలీ**

**-తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా**




**మందస, ఫిబ్రవరి 14(వార్త):** చార్టర్ ఆఫ్ డిమాండ్స్ పరిష్కారం చేయాలని గత ఎనిమిది నెలలుగా ఎదురు చూసి చివరిగా కార్మికులు సమ్మె చేస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం మందస బజారు జంక్షన్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. అనంతరం ధర్నానిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, మండల కన్వీనర్ కె.కేశవరావు, సీఐటీయూ నాయకుడు ఆర్.దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో ఈ ధర్నా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతన సవరణ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు యజమానులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వల్లనే యజమానులు నిర్లక్ష్యంగా ఉన్నారని ఆరోపించారు. రైస్ మిల్లు కార్మికులు డిమాండ్ నోటీసు ఇచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా వేతన సవరణ చేసేందుకు ముందుకు రాకుండా కార్మికులకు ఇబ్బందికి గురి చేస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని అన్నారు. యాజమాన్యాల మొండి వైఖరే కార్మికులకు సమ్మెలోకి నెట్టిందని తెలిపారు. యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కార్మికులకు హక్కులు ఉల్లంగిస్తున్నారని, జిల్లా లేబర్ అధికారులు చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే దశలవారీగా ఉధృత పోరాటానికి కార్మికులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. సమ్మె నాల్గవ రోజుకు చేరింది. కార్యక్రమంలో రైస్ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు టి. లక్ష్మీనారాయణ, కె.బాలకృష్ణ, బి.దుర్యోధన, పి.కూర్మారావు, ఆర్.ఏకాశీ, బి.వెంకటేశం, బి.మల్లేశ్వరరావుపాటు బి.పోలయ్య, ఎ.లోకనాదం, జీడి కార్మిక సంఘం నాయకులు సిహెచ్ చంద్రావతి, గుసిరి బాలమ్మ, బాడ వెంకటమ్మ, బాడ వరాలమ్మ, సి హెచ్ జానకమ్మ, బాడ హిమావతి తదితరులు పాల్గొన్నారు.

# మండల డిజిటల్ అసిస్టెంట్స్ అధ్యక్షుడిగా లోకేష్



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 14(వార్త):** మండలంలో పంచాయతీ సెక్రెటరీ గ్రేడ్ 6 డిజిటల్ అసిస్టెంట్ మండలస్థాయి యూనియన్ నియామకం జరిగింది. అధ్యక్షులుగా లోకేష్ దుర్గాసి, జనరల్ సెక్రెటరీగా సాడి కృష్ణారావు, ట్రెజరర్ గా నీరజ కురమాన ,మరియు దున్న తారకేశ్వరరావు చుక్క దీపిక ఆర్గనైజేషన్ కార్యదర్శిగా ఏకగ్రీవం ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా మండలంలోని డిజిటల్ అసిస్టెంట్ సమస్యలను పరిష్కరించడం వారి సంక్షేమం కోసం కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యంగా తెలిపారు. డిజిటల్ అసిస్టెంట్ ఎదుర్కొనే ప్రతి సమస్యను యూనియన్ కట్టబడి ఉంటుందని హామీ ఇచ్చారు .వీరిని ఎంపీడీవో కే రామారావు, ఈవోపీఆర్డి కృష్ణ, సీనియర్ అసిస్టెంట్ పాణిగ్రాహి, జూనియర్ అసిస్టెంట్ వినోద్ , కంప్యూటర్ ఆపరేటర్ మౌళి , జగదీష్ లు అభినందించారు.

# ఆదివాసీలపై సైనిక బలగాల దాడులను ఆపాలి

**-కాశీబుగ్గలో ప్రజా సంఘాల నిరసన**




**పలాస, ఫిబ్రవరి 14 (వార్త):** మధ్య భారతంలోని చత్తిస్గఢ్ బీజాపూర్ అటవీ ప్రాంతంలో ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై సాగిస్తున్న సైనిక బలగాల దాడులను తక్షణమే ఆపాలని వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, హక్కుల సంఘాలు ఉమ్మడిగా డిమాండ్ చేశాయి. శుక్రవారం కాశీబుగ్గ పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వ పాశవిక పాలనకు వ్యతిరేకంగా నిరసన తెలిపాయి. ఈ దేశ మూలవాసులపై అంతిమ యుద్ధం ప్రకటించడం సిగ్గుచేటని, ఆపరేషన్ కగార్ ను తక్షణమే నిలిపివేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. పర్యావరణాన్ని, ప్రకృతిని సహజ వనరులను కాపాడుతున్న ఆదివాసీలపై అంతర్యుద్ధం ప్రకటించిన దేశ అధినేత మోదీ, అమిత్ షాల చర్యలను ఖండించాలని వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. మావోయిస్టుల పేరుతో అడవుల్లో ఉన్న ఆదివాసీలను అంతమొందించి అడవులను ఖాళీ చేయించి, బహుళ జాతి కంపెనీలకు ఆడవులను అప్పగించడానికి వీరు కగార్ ఆపరేషన్ చేపెట్టారని విమర్శించారు. మావోయిస్టు భావజాలం కలిగి ఉండడం నేరం కాదని కోర్టులే స్వయంగా చెప్తున్నాయి. దేశ శత్రువుల మీద యుద్ధం ప్రకటించినట్లుగా డ్రోన్ కెమెరాలతో అత్యంత ఆధునిక సాంకేతి పరిజ్ఞానంతో అడవుల్లో జల్లెడ పట్టి సాధారణ ఆదివాసి ప్రజలను కాల్చి చంపుతున్నారు. మానవాళి మనుగడకు అవసరమైన పర్యావరణాన్ని ప్రపంచానికి అందిస్తున్న ఆదివాసులను, ఈ దేశ సరిహద్దుల్లో ఉండాల్సిన సైన్యం అంతిమ యుద్ధం పేరుతో కాల్చి చంపడం దుర్మార్గం. ఈ సైనిక బలగాలకు నేతృత్వం వహిస్తున్నటువంటి అధికారుల పైన అత్యాచారం కింద కేసులు నమోదు చేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అధ్యక్షత వహించగా, న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు వంకల మాధవరావు, సిపిఐ కార్యదర్శి చాపర వేణుగోపాల్, సిపిఎం నాయకులు కోనారి మోహన్ రావు, లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షు పత్తిరి దానేష్, అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర నాయకులు జోగి కోదండరావు, దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం రాష్ట్ర నాయకులు వీరాస్వామి, ప్రగతిశీల కార్మిక సమాఖ్య మద్దిల ధర్మారావు, పుచ్చ దుర్యోధన, జుత్తు వీరాస్వామి, ప్రజా కళామండలి రాష్ట్ర నాయకులు కె. నీలకంఠం, ప్రగతిశీల మహిళా సంఘం పోతనపల్లి జిల్లా నాయకులు పోతనపల్లి కుసుమ, బదకల ఈశ్వరమ్మ, బర్ల జానకమ్మ, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు మామిడి భీమారావు, గౌరకల బాలకృష్ణ, మద్దిల రామారావు, ఉత్తరాంధ్ర మహిళా సంఘం పోతనపల్లి అరుణ, నాగమణి, రైతు కూలీ సంఘం కోనేరు రమేష్ , సార జగన్, బర్ల గోపి, రాపాక మాధవరావు , పోతనపల్లి మల్లిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే క్షమించేది లేదు





**పలాస, ఫిబ్రవరి 14 (వార్త):** పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే క్షమించేది లేదని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేనా రామారావు హెచ్చరించారు. శుక్రవారం పలాస కాశీబుగ్గ పురపాలక సంఘంలో రోజువారి శానిటేషన్ పరిశీలనలో భాగంగా మున్సిపల్ కమిషనర్ వార్డుల్లో పర్యటన చేశారు.కాశీబుగ్గ 17వ వార్డు తిలక్ నగర్లో రోడ్డు స్వీపింగును పరిశీలించి, 13వ వార్డు పాత బస్టాండ్ లో గార్బేజ్ ను క్లియర్ చేయించారు. 15వ వార్డు నెహ్రు నగర్ లో డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్ ప్రక్రియను పరిశీలించారు. 16వ వార్డు శ్రీనివాస నగర్ లో డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్ ప్రక్రియను తనిఖీలు చేశారు. కాశీబుగ్గ 3వ వార్డు పాత జాతీయ రహదారి 5 రోడ్డులో గల విజయ నారాయణ హాస్పిటల్ వద్ద బ్లాక్డ్ మేజర్ డ్రైన్ ను క్లియర్ చేయించడం జరిగింది. 4వ వార్డు పద్మనాభపురం కాలనీ అక్కుపల్లి రోడ్డు వద్ద బ్లాక్డ్ మేజర్ డ్రైన్ ను పారిశుధ్య సిబ్బందితో క్లియర్ చేయించారు. కాశీబుగ్గ పాత బస్టాండ్ రోడ్ లో గల “అన్న క్యాంటీన్” ను రోజువారి తనిఖీలలో భాగంగా, ఈరోజు కూడా ఇన్స్పెక్ట్ చేసి, ఈరోజు లబ్ధిదారులుకు ఇచ్చిన బ్రేక్ ఫాస్ట్ మెనూలో క్వాలిటీ-క్వాంటిటీ చెక్ చేసి, ప్రభుత్వ నిబంధనల మేరకు సరఫరా చేయవలసినదిగా నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ శానిటేషన్ ఇన్స్పెక్టర్ లు ఉదయ్ పాత్ర, వెంకటేష్, శానిటేషన్ సూపర్వైజర్లు సోమేశ్, గోపాల్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ

**పలాస, ఫిబ్రవరి 14 (వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ మూడవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో ప్రతిభ చూపించారు. ప్రధమ , ద్వితీయ స్థానాలను పొందిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ మూడవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు నందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పలాస విద్యార్థులు తన ప్రతిభను చాటారు. బీకాం హానర్స్ నందు ఎస్ కావ్య , ఎస్ . మక్బుల్ ఉండగా , బి ఏ హానర్స్ నందు ఐ . చామంతి ( 8.33 సి జి పి ఏ) , ఎం . పూజిత ప్రధమ, ద్వితీయ స్థానం లను , బి ఎస్ సి హానర్స్ మాథమాటిక్స్ నందు ఎస్.ప్రదీప్ (8.39 సి జి పి ఏ ) , కె . రాజేష్ ప్రధమ ద్వితీయ స్థానాలను బి ఎస్ సి, హానర్స్ జూలజీ నందు ఎన్. త్రివేణి, ఏ. మేఘన ప్రధమ ద్వితీయ స్థానాలను కళాశాల స్థాయిలో పొందారు. వీరిలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె వెంకటలక్ష్మి అభినందించారు. వీరి పురోగతికి తోడ్పడిన కళాశాల అధ్యాపకులు అందరికీ శుభ అభినందనలు తెలిపారు.

## హరిపురం సీహెచ్‌సీలో స్టెమి ఇంజక్షన్



**మందస, ఫిబ్రవరి 14(వార్త):** హరిపురంలో గల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్టెమి ఇంజక్షన్ అందుబాటులో ఉందని సూపరిండెంట్ డాక్టర్ కణితి స్వరాజ్యలక్ష్మి తెలిపారు. షుగర్, బీపీ ఉన్న పేషెంట్లకు ఆయాసము, గుండెనొప్పి, ఎడమ చేయి నొప్పి వంటి లక్షణాలు ఉన్నట్లయితే తక్షణమే ప్రభుత్వాసుపత్రికి సంప్రదిస్తే ఈ ఇంజక్షన్ ఉచితంగా వేస్తామన్నారు. గుండెపోటు వచ్చిన మొదటి గంటను వైద్యులు గోల్డెన్ హావర్ పరిగణిస్తారని, ఆ సమయంలో స్టెమి ఇంజెక్షన్ ఇవ్వడం వలన ఎక్కువ శాతం రోగులు ప్రాణాపాయం నుండిబయటపడే అవకాశం ఉంటుందన్నారు. ఈ ఇంజక్షన్ ను రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులోకి తీసుకొని రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పలాస కుర్రాళ్లను ఆదరిద్దాం




**పలాస, ఫిబ్రవరి 14 (వార్త):** కాశీబుగ్గ ఆంధ్ర బ్యాంక్ రోడ్డు లిటిల్ ఛాంపియన్ స్కూల్ ఆవరణలో శనివారం సాయంకాలం ఆరు గంటలకు పలాస కుర్రాళ్ళతో రెండు సంవత్సరాలు ఎంతో శ్రమించి ఐఫోన్తో చిత్రీకరించిన సినిమా హే కేశవ ..హేమాధవ.. హేగోవిందా చిత్ర ప్రదర్శన జరుగుతుందని వెల్లడించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు జీకే ప్రసాద్ మాట్లాడుతూ మన ప్రాంతంలో జరిగిన యదార్థ సంఘటనలు, యువకులు వల్ల ప్రభావితమయ్యే సమాజం గురించి మెసేజ్ ఓరియెంటెడ్‌గా, క్రైమ్ థ్రిల్లర్ మూవీగా చిత్రీకరించడం జరిగిందని తెలియజేశారు. గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ మాట్లాడుతూ మన ప్రాంత యువకులు ఎంతో శ్రమించి, తమలో ఉన్న టాలెంట్ వ్యక్తపరిచే విధంగా మీరు ఆశించే విధంగా ఈ చిత్రం ఉంటుందని ఆశాభావం తెలియజేశారు. జంట పట్టణాల ప్రజలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఎక్స్ రాజా, పలాస వాసి దిలీప్ కుమార్, దివాకర్, నిత్యానాద్బృండ,చిత్ర బృందం పాల్గొన్నారు.

## సుష్మాస్వరాజ్‌కు ఘన నివాళులు

**పలాస, ఫిబ్రవరి 14 (వార్త):** సుష్మా స్వరాజ్’ వర్ధంతి సందర్భంగా వారికి పలాస నియోజకవర్గం ఘన నివాళులు అర్పించారు. పలాస నియోజకవర్గం కన్వీనర్ రామానంద స్వామి, మైనార్టీ మోర్చ జిల్లా అధ్యక్షులు ఘని, మందస మండలం మాజీ అధ్యక్షులు పొందర దుదిస్టి పాత్ర, పలాస బీజేపీ సీనియర్ నాయకులు లక్కోజు ధర్మారావు, బిజెపి కార్యకర్తలు నివాళులు అర్పించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## కొప్పర సచివాలయాన్ని సందర్శించిన ఈవోపీఆర్డీ

**వంగర, ఫిబ్రవరి 14 (వార్త):** కొప్పర గ్రామ వార్డు సచివాలయాన్ని ఇవో పి ఆర్ డి కెల్ల రామారావు శుక్రవారం సందర్శించి పరిశీలించారు. అనంతరం గ్రామం లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. చెత్త సంపద కేంద్రం మిత్రులకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఎస్టిమేషన్ వేసి ఈ నెలాఖరులాగా మరమ్మతులు పూర్తి చేసి వినియోగంలోకి వచ్చేలా చూడాలని పంచాయతీ కార్యదర్శి ఎల్.గోపికి సూచించారు.





## ఎమ్మెల్సీ హరిప్రసాద్‌ను కలిసిన కంచరాన, మజ్జి

**మందస, ఫిబ్రవరి 14(వార్త):** జనసేన పార్టీ అధ్యక్షుని రాజకీయ కార్యదర్శి, ఎంఎల్సీ హరిప్రసాద్ ను ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రచార కమిటి కోఆర్డినేటర్ కంచరాన అనిల్‌కుమార్, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి మజ్జి భాస్కరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను అనిల్ కుమార్, భాస్కరరావు దుశ్శాలువతో సన్మానించారు. అనంతరం పలాస నియోజకవర్గం సమస్యలు, పార్టీ పరిస్థితులపై ఎంఎల్సీ హరిప్రసాద్ కు వివరించారు.

## క్రమశిక్షణ తో కూడిన విద్యనభ్యసించాలి



**వంగర, ఫిబ్రవరి 14 (వార్త):** విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉత్తమ పౌరులు గా ఎదగాలని వేద పండితులు శ్రీధర్మ శాస్త్ర ఆలయ ధర్మకర్త ఆరవెల్లి' శ్రీనివాస శర్మ అన్నారు. శుక్రవారం వివేక్ మాస్టర్ మైండ్స్ పాఠశాల ఆవరణ లో విద్యార్థులు ఉపాధ్యాయులు శ్రీనివాస శర్మ గారిని ఘనంగా సన్మానించి సత్కరించారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సత్ ప్రవర్తన కలిగి ఉత్తమ పౌరులుగా ఎదగాలని అన్నారు. ఇందులో పాఠశాల యాజమాన్యం సిబ్బంది పాల్గొన్నారు.

## గణేశ్‌నగర్ పేరుపై హర్షం



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 14(వార్త):** మున్సిపాలిటీ పరిధి 9 వ వార్డు స్థానిక హాస్పిటల్ రోడ్డు ఐస్ ప్యాక్టరీ ప్రాంతానికి గణేశ్ నగర్ పేరు నిర్ణ హిస్తూ మున్సిపల్ అధికారులు అధికారికంగా ఆదేశాలు జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎన్ రమేష్ కు జిల్లా బిజెపి ట్రేడ్ సెల్ అధ్యక్షుడు జి. సాయి కామేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.ఎమ్మెల్యే బెందాలం అశోక్ కు కూడా కృతజ్ఞతలు తెలిపారు.

## చిన్నారులకు ఉపకరణాల పంపిణీ

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 14(వార్త):** ఇచ్ఛాపురంలోని మున్సిపల్ పంజా వీధి పాఠశాల విద్యార్థులకు ప్రముఖ వ్యాపార వేత్త పచ్చి గోళ్ళ బాల చంద్ర రావు పలకలు ,పుస్తకాలు, పెన్సిల్ లు,కలర్ పెన్సిల్ బాక్స్ లు పంపిణీ చేశారు. అబుదాబీలో ఉన్న తన మనవరాలు మిహిరా అక్షరాభ్యాసం సందర్భంగా వీటిని మనుమరాళ్ళు శాన్వి, శ్రీనిత్య చేతులు మీదుగా అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం డబ్బీరు ధనలక్ష్మి, కాళ్ల శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



# దేశ విముక్తికి విప్లవకారుల ఐక్యత అవసరం

**-న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్**



**పలాస, ఫిబ్రవరి 14 (వార్త):** ఆంధ్రప్రదేశ్‌లోని రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన ప్రకటన సభ విజయవాడ రాఘవయ్య పార్క్ ఎంబీ భవన్ ఆడిటోరియంలో ఫిబ్రవరి 23 ఆదివారం ఉదయం 10 గంటలకు జరుగుతుందనీ ఈ సభను విజయవంతం చేయడానికి విప్లవకారులు, అభిమానులు, ప్రజా సంఘాలు, మేధావులు, ప్రజలు తరలి రావాలని సీపీఐ యం. యల్ న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ పిలుపునిచ్చారు. విలీన ప్రకటన సభను విజయవంతం చేయాలని కోరుతూ విలీన ప్రకటన సభ పోస్టర్లు, కరపత్రాలను శ్రీకాకుళం జిల్లా పలాస మండలం బొడ్డపాడు అమర వీరుల స్మారక భవనం వద్ద ఉభయ పార్టీ శ్రేణులు శుక్రవారం ఆవిష్కరించి విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ 2013లో రాజకీయ విభేదాల కారణంతో రెండుగా చీలిపోయింది. తిరిగి రెండు పార్టీలు రాజకీయ విభేదాలను, నిర్మాణ సమస్యలను పరిష్కరించుకొని ఒకే న్యూడెమోక్రసీగా ఏర్పడాలని రెండు కేంద్ర కమిటీలు 2024 డిసెంబర్ 28న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలీనమై ఉమ్మడిగా సభను నిర్వహించాయన్నారు. 2025 జనవరిలో సమావేశమైన ఏపీలోని రెండు న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీల ఉమ్మడి సమావేశం నిర్ణయం మేరకు విజయవాడలో విలీన ప్రకటన సభ నిర్వహిస్తున్నామన్నారు. భారతదేశంలో పాలవకవర్గ పార్టీలన్నీ పెద్ద పెట్టుబడిదారులకు, కార్పొరేట్ కంపెనీలకు దేశ సంపదలను లూటీ చేయడానికి అవకాశాలను కల్పిస్తున్నాయని ప్రకాష్ విమర్శించారు. దేశ ప్రజలకు మాత్రం ఆకలి, దారిద్యం, నిరుద్యోగం, నిరక్షరాస్యతలను మిగిల్చాయని విమర్శించారు. ప్రజలపై ప్రత్యక్ష పరోక్ష పన్నుల భారం మోపుతూ, ధరల భారాన్ని ప్రజల నెత్తిన రుద్దుతున్నారని, కార్పొరేట్ కంపెనీలకు వరాల జల్లులను కురిపిస్తున్నారని, రాయితీలను కల్పిస్తున్నారని విమర్శించారు. దేశ ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టు విప్లవకారుల ఐక్యత అత్యవసరమని, అందులో భాగంగానే రెండు న్యూడెమోక్రసీ పార్టీలు విలీనం కావడంతో ప్రజా పోరాటాలకు మరింత బలం చేకూరుతుందనే ఆశాభావాన్ని ప్రకాష్ వ్యక్తం చేశారు. బిజెపి నాయకత్వంలోని మోడీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ వ్యూహంలో భాగంగా రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతుందని, ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తుందని, ప్రజల తరఫున మాట్లాడే వారిని నిలదీసే వారిని నిర్బంధిస్తున్నారని, అందులో భాగమే ఉపా చట్టం పేరుతో జరుగుతున్న అరెస్టులని విమర్శించారు. ఆపరేషన్ కగారు పేరుతో దండకారణ్యంలోని సంపదలను కొల్లగొట్టడానికి, ఆదివాసీలను అడవుల నుండి నెట్టు వేయడానికి, అటవీ సంపదలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి విదేశాలతో యుద్ధం చేయాల్సిన సైన్యాన్ని, దేశ ప్రజలపైన ఆదివాసీలపైన ఉసుగొలుపుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వంకల మాధవరావు మాట్లాడుతూ ఇట్లాంటి ఫాసిస్ట్ నిర్బంధాల కాలంలో కమ్యూనిస్టు విప్లవకారుల ఐక్యత ఈ దేశానికి ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ, ప్రజా సంఘాల నాయకులు గొరకల బాలకృష్ణ, జి.వీరాస్వామి, పోతనపల్లి కుసుమ, బతకల ఈశ్వరమ్మ, కుత్తుం హేమక్క, బర్ల జానకమ్మ, సార జగన్, బర్ల గోపి, వంకల పాపయ్య, సార నూకయ్య, పి.మల్లిబాబు , కర్రి అప్పారావు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాహుదా పాత వంతెనపై భారీ వాహనాల రాకపోకలు

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 14(వార్త):** శిథిలావస్థ లో ఉన్న బాహుదా పాత జాతీయ రహదారి వంతెన పై నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీని వల్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు రెండేళ్ల క్రితం బాహుదా వంతెన కుప్పకూలిన సంగతి తెలిసిందే. అప్పటినుంచి నూతన వంతెన నిర్మాణం చేపట్టకపోగా తాత్కాలికంగా మట్టి వేసి ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు మాత్రమే అనుమతించారు. భారీ వాహనాలు వెళ్లకుండా రెండువైపులా సైడ్ గోడల నిర్మాణం చేపట్టారు. అలాగే పైన ఐరన్ బార్ కేడ్ లను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ గోడలను నెమ్మదిగా అక్రమ దారులు కూల్చివేశారు. రైలింగ్ కూడా తీసివేశారు. దీంతో భారీ వాహనాలు యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నాయి. శుక్రవారం సుమారు 40 టన్నుల లోడుతో ఉన్న సిమెంట్ లారీ వంతెన దాటుకుంటూ వచ్చింది. అక్కడే ఉన్న ఆటో డ్రైవర్లు అడ్డుకున్నప్పటికీ లారీ డ్రైవర్ నిర్లక్ష్య సమాధానం చెబుతూ ముందుకు రావడంతో లారీ వంతెన దాటే సమయంలో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది.ఎప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు పోలీసు అధికారులు మరోమారు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని స్థానికలు కోరుతున్నారు.





## వీరాస్వామి మరణం తీరని లోటు

**మందస, ఫిబ్రవరి 14(వార్త):** అగ్నికుల క్షత్రియ కులం నాయకునిగా, ఉద్దానం వాసిగా దున్న వీరాస్వామి ఎన్నో సేవలు అందించారని డాక్టర్ వై.యస్.ఆర్.ఉద్యాన యూనివర్సిటీ బోర్డ్ మెంబెర్ బత్తిని లక్ష్మణ్, మడియా రామకృష్ణ, దున్న హరికృష్ణ, దున్న గాంధీవర్మ, గుంటు రామస్వామి అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం అమలపాడు గ్రామానికి చెందిన దున్న వీరా స్వామి కుటుంబాన్ని వారు పరామర్శించారు. రెండుసార్లు వజ్రపుకొత్తూరు జడ్పీటీసీగా, మూడుసార్లు పంచాయతీ సర్పంచ్‌గా, మూడుసార్లు ఎంపీటీసీగా బాధ్యతలు నిర్వహించారన్నారు. మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ జుత్తు జగన్నాయకులకు అనుచరుడిగా ఉంటూ ఉద్దాన ప్రాంత ప్రజలు అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడిన ప్రజా సేవకుడన్నారు. వైస్సార్సీపీ సీనియర్ నాయకులకి ఆదర్శప్రాయడని, ఆయన అనారోగ్యంతో బాధపడుతూ మర ణించారని, వీరాస్వామి మరణం తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వీరాస్వామి పవిత్ర ఆత్మకి శాంతి చేకూరాలని భగవంతునికి ప్రార్థిస్తున్నామన్నారు.

# అమరవీరులకు నివాళులు




**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 14(వార్త):** ఇచ్ఛాపురం శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో పుల్వమా దాడిలో అమరులైన జవాన్ లకు స్కూల్ చైర్మన్ డి. కృష్ణమూర్తి రెడ్డి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ జమ్మూ కశ్మీర్‌లో సైనిక బలగాలే లక్ష్యంగా ఉగ్రమూకలు నిరంతరం దాడులకు పాల్పడుతుంటాయి. అయితే, ఏకంగా సైనిక వాహన శ్రేణినే టార్గెట్ చేస్తూ ఉగ్రవాదులు దాడికి పాల్పడి 40 మంది సైనికులను పొట్టనబెట్టుకున్న ఘటన 2019 ఫిబ్రవరి 14న చోటుచేసుకుంది. పాక్ ఉగ్రవాదులు దుశ్చర్యకు సైనికులు బలయ్యారు. ఓ మలుపు వద్ద పేలుడు పదార్థాలతో కూడిన వాహనంతో వేగంగా కాన్వాయ్‌లోకి ప్రవేశించిన ఫిదాయి.. తనను తాను పేల్చుకుని దారునికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో యావత్ దేశం శోకంలో మునిగిపోయింది. దేశ సేవలో అమరులైన జవాన్ లకు ఇదే మా నివాళులు ప్రతీ జవాన్ కు పాదాభి వందనం చేస్తూ జై జవాన్ జై భారత్ అని తెలియజేసారు. స్కూల్ చైర్మన్ డి. కృష్ణమూర్తి రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు అమరులైన జవాన్ ల కోసం మౌనం పాటించి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ కే.సి. పూరి ఉపాధ్యాయులు సురేఖ, పద్మజ, సునీత, ఇంటరక్ట్ క్లబ్ జాయింట్ సెక్రటరీ డి.హర్షవర్ధన్ రెడ్డి, యస్ పి యల్ జ్యోత్స్న పాల్గొన్నారు.


జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# బ్రహ్మాండ నాయకుని..

# బ్రహ్మోత్సవం

* మందసలో వాసుదేవుని 16వ బ్రహ్మోత్సవాలు * 17 నుంచి 23వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహణ * ముస్తాబవుతున్న మందస





**మందస, ఫిబ్రవరి 14(వార్త):** మందస పట్టణంలోని శ్రీవాసుదేవపెరుమాళ్ బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 17వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరపడానికి నిర్వాహకులు సన్నహాలు చేస్తున్నారు. వాసుదేవుని 16వ బ్రహ్మోత్సవాలను ఆలయ అభివృద్ధి కమిటీ విజయవంతం చేయడానికి శ్రమిస్తోంది. బ్రహ్మోత్సవాలకు మందస పట్టణం ముస్తాబవుతోంది. శ్రీవాసుదేవ పెరుమాళ్ ఎంతో చారిత్మాక ఆలయం. 14వ శతాబ్ధానికి చెందినది. ఒడిశాశిల్పులు ఆలయాన్ని నిర్మించడంతో ఒడిశాలోని ఎంతో ప్రసిద్ధి చెందిన లింగరాజు ఆలయాన్ని వాసుదేవ ఆలయం పోలి ఉంటుంది. ఉత్కళ సంస్కృతి ఆలయంలో కనిపిస్తోంది. కాంచిపురంలోని శ్రీవరదరాజస్వామి ఆలయం ప్రాంతంలో స్వామివారి విగ్రహాన్ని శిల్పులు తయారు చేశారు. కష్ణశిలతో శ్రీవాసుదేవుని నిజస్వరూపాన్ని చెక్కారు. మందస సంస్థానాన్ని రాజుల పరిపాలించే కాలంలో ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. వారి హయాంలో స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగేవి. రాజరిక పాలనలో తొమ్మిది రోజుల పాటు వాసుదేవుని బ్రహ్మోత్సవాలు నిర్వహించేవారు. రాజరిక పాలన అంతరించడంతో కాలక్రమేణా బ్రహ్మోత్సవాలు నిలిచిపోయాయి. శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్స్వామి ఆధ్వర్యంలో 2010వ సంవత్సరం ఫిబ్రవరి 5వ తేదీన బ్రహ్మోత్సవాలు పునః ప్రారంభించారు. ఈ ఏడాది కూడ ఫిబ్రవరి 17వ తేదీ నుంచి 23వ తేదీ వరకు మందస శ్రీ వాసుదేవస్వామి 16వ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ప్రత్యేకంగా శ్రీత్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి, శ్రీత్రిదండి అహోబిలరామానుజ జీయర్ స్వామి, శ్రీత్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయని, ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు(కూర్మాస్వామి), శ్రీవాసుదేవసేవాసమితి ప్రతినిథులు తెలిపారు.

### ఆలయ ప్రాముఖ్యం-విశిష్టత

1744వ సంవత్సరంలో వాసుదేవుని ఆలయాన్ని మందస సంస్థానానికి విద్వాంసులుగా నరసాపురానికి చెందిన తెలికిచర్ల కందాడ రామానుజాచార్యస్వామి విద్వాంసులుగా ఉంటూ ఆలయానికి స్థానాచార్యులుగా ఉండేవారు. ఈతని వద్ద త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద జీయర్ స్వామి, గోపాలాచార్య స్వామి శిష్యులుగా ఉండేవారు.







వాసుదేవుని ఆలయప్రాంగణంలో ఉన్న వేద పాఠశాలలో వీరు ఇరువురు చేరి వేదంపండిత విద్యను అభ్యసించారు. ఈ వేద పాఠశాలలో ఎంతో మంది ప్రముఖులు వేదాంత విద్యను అభ్యసిస్తూ. వాసుదేవుని ఆలయంలో నిత్యపూజలు జరిపేవారు ప్రతి ఏటా అంగరంగ వైభవంగా తొమ్మిది రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు అప్పటి రాజరిక పాలనలో ఉన్న ఇరుగుపొరుగు రాజ్యాల నుంచి అశేష భక్త జనులు వచ్చేవారని ప్రతీతి.

### ఆలయాన్ని దత్తత తీసుకున్న చిన్న జీయర్ స్వామి

రాజరిక పాలన అంతరించిన తరువాత కొన్ని దశాబ్ధాల పాటు ఆలయం మూతబడి, శిథిలావస్థకు చేరుకుంది. శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద జీయర్ స్వామి, గోపాలాచార్యస్వామిల వద్ద త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి శిష్యరికం చేశారు. ఆయన వాసుదేవుని ఆలయాన్ని చారిత్రక ప్రాముఖ్యతను గుర్తించి గురువుల స్మారకార్ధం అభివద్ధి చేసేందుకు సంకల్పించారు. ఈ ఆలయాన్ని పునఃప్రతిష్టించేందుకు పూనుకున్నారు. 2000 జూలై 7వ తేదీన చిన్నజీయర్స్వామి సారథ్యంలోని మధుభయ వేదాంత ఆచార్య పీఠం దేవాదాయశాఖ నుంచి వాసుదేవుని ఆలయంపై సర్వహక్కులు తీసుకుంది. శిథిలావస్థకు చేరిన ఆలయం 2001 నుంచి ఆలయ పునర్నిమాణ పనులు చేపట్టారు. నిర్మాణానికి సుమారు రూ. 2 కోట్లు వెచ్చించారు. ఒడిశాకు చెందిన శిల్ప కళాకారులను తెప్పించి పూర్వకళాకతిలో నిర్మాణం జరిపారు. 2009 ఫిబ్రవరి 19వ తేదీన సాంప్రదాయబద్ధంగా వేదపండితులతో అంగరంగ వైభవంగా పునఃప్రతిష్టించారు. రాజరిక పాలనలో ఉన్న విగ్రహాన్నే యథావిధిగా పునఃప్రతిష్టించారు. శ్రీవాసుదేవుని తిరుపతి కొండపై ఉన్న వెంకటేశ్వరస్వామి విగ్రహం మాదిరిగానే నల్లరాతితో వాసుదేవుని నిజరూపం ఉండడం విశేషం. గత 15ఏళ్లుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు ఈ ప్రాంతీయులే కాకుండా ఇతర జిల్లాల నుంచి, రాష్ట్రాల నుంచి భక్తులు వస్తూ ఉంటారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546